సాక్షి
నారాయణపేట
శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



ప్రారంభానికి సిద్ధం..
పాలమూరులోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను శుక్రవారం ప్రారంభించనున్నారు.
వివరాలు 8లో ▸



జూరాల గేట్ల మూసివేత
జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో గేట్లను మూసివేశారు.
వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.2 /23.1

వాతావరణం
ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రమంగా ఆకాశం మేఘావృతం అవుతుంది. వర్షం పడే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

గుర్తింపు కోసం విమర్శలు తగదు



కోస్గి: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తన స్థాయి మరిచి గుర్తింపు కోసం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, వారి కుటుంబంపై విమర్శలు చేయడం తగదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్యాసం రామకృష్ణ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపుతామంటూ విమర్శలు చేస్తున్నారని, గతంలోనే కోడంగల్ ప్రజలు రేవంత్‌రెడ్డిని ఇక్కడి నుంచి సాగనంపారని, ఆ విషయం గుర్తుంచుకోవాలన్నారు. కోడంగల్‌లో జరిగిన అభివృద్ధిపై చర్చకు రాకుండా ముఖం చాటేస్తున్న రేవంత్‌రెడ్డి ముందుగా కోడంగల్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు రావాలన్నారు. ఇప్పటికైన స్థాయి మరిచి విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రాజేష్, నాయకులు మాస్టర్ శ్రీను, కుమ్మరి బిచ్చప్ప, మాజీ ఎంపీటీసీ హన్మంతు, నాచారం అంజిలయ్య, పాశం రమేష్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక కోడ్లను రద్దు చేయాలి



నారాయణపేట: కార్మిక వర్గం స్వాతంత్ర్యం పూర్వం నుండే పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్చి కార్మిక కోడ్‌లను తీసుకు వచ్చి అమలు చేస్తే కార్మికులు బానిసత్వం లోకి నెట్టవేయబడతారని, వెంటనే రద్దు చేయాలని వక్తలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మిక కర్షక జాతీయ సంఘాల పిలుపు మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు దగ్గర ఐఎఫ్‌టీయు జిల్లా కార్యదర్శి నరసింహ అధ్యక్షతన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామరెడ్డి, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి బి.రాములు మాట్లాడుతూ నరేంద్రమోడీ ప్రభుత్వం కార్మిక కోడ్‌లు అమలులోకి తీసుకొస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్మిక కోడ్‌తో కార్మికుల సంఘం పెట్టుకునే హక్కు, కనీస వేతనం అడిగే హక్కు ఉద్యోగ భద్రత తదితర కార్మిక హక్కులు కాలరాయపడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశా కార్యకర్తలకు పారితోషికం రద్దు చేసి కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కరోనా కష్టకాలంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలను కాపాడిన ఆశాకార్యకర్తలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని విమర్శించారు. బ్యాంకింగ్, రైల్వే, విమానయానం తదితర దేశ సంపద అదానీ, అంబానీకి అప్పనంగా కట్టబెడుతున్నారు. ప్రైవేటీకరణ విధానాలు కార్మికులకు, ప్రజలకు నష్టదాయకమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్, యాదగిరి , కిరణ్, జయ, బాల్‌రాం తదితరులు పాల్గొన్నారు.

పీజీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈమేరకు పీయూలో పరీక్షకేంద్రాన్ని కంట్రోలర్ రాజ్‌కుమార్ తనిఖీ చేశారు. పీయూ పరిధిలో ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో 1900 విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 1870 మంది హాజరయ్యారు.

నేడు కాంట్రాక్టు అధ్యాపకుల సామూహిక దీక్ష

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ పీయూ పరిధిలోని అన్ని పీజీ సెంటర్ల అధ్యాపకులు పీయూలో శుక్రవారం సామూహిక దీక్ష చేపట్టనున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు పీయూ గేట్ వద్ద నిరసన తెలిపిన అధ్యాపకులు మాట్లాడుతూ ఎంతో కాలంగా పనిచేస్తున్నా ప్రభుత్వం గుర్తించడం లేదని, వెంటనే స్పందించి తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు భూమయ్య, సుదర్శన్‌రెడ్డి, అర్జున్‌కుమార్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చుక్కేసి.. చుక్కలు చూపిస్తున్నారు!

సాక్షి విజిట్



- రాత్రివేళ మందుబాబుల హల్‌చల్
- పట్టణాల్లోని ప్రధాన రోడ్లపై సైతం సిట్టింగ్‌లు
- ఆయా ప్రాంతాల్లో తిరిగేందుకు జంకుతున్న మహిళలు
- నిత్యం గొడవలు.. ట్రాఫిక్‌కు అంతరాయాలు

రాత్రి 7 గంటలు అయిందంటే చాలు ఆ ప్రాంతాలన్నీ రద్దీగా మారిపోతాయి. ప్రధాన రహదారి.. కాలనీల్లో గల్లీ అనే తేడా లేకుండా వాహనాలన్నీ ఎక్కడపడితే అక్కడ ఆపేస్తారు. ఫుల్లుగా మద్యం తాగి.. ఇటు వాహనదారులకు.. అటు పాదచారుల రాకపోకలకు ఆటంకం కలిగిస్తారు. కొందరు మందుబాబులు మద్యం మత్తులో గొడవ పడటం, వచ్చిపోయే వారిని వేధింపులకు గురిచేయడం వంటి సంఘటనలతో అర్ధరాత్రి వరకు భయానక వాతావరణం సృష్టిస్తారు. కొందరు మద్యం దుకాణాల వారు అనధికారికంగా సిట్టింగ్‌లు ఏర్పాటు చేసి యథేచ్ఛగా విక్రయాలు సాగిస్తారు. అయితే పోలీసులు మాత్రం చివరి నిమిషంలో దుకాణాల వద్దకు మూసివేయాలని సూచిస్తూ 'మామూలు'గా వెళ్లిపోతున్నారు. ఈ క్రమంలో పాలమూరు ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో 'సాక్షి' విజిట్ నిర్వహించగా తాగుబోతుల ఆగడాలు వెలుగుచూశాయి.

– సాక్షి నెట్‌వర్క్

ఎక్కడపడితే అక్కడే వాహనాలు నిలిపి..

మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ఆయా వైన్ షాపుల వద్ద గురువారం రాత్రి 7.30 నుంచి అర్ధరాత్రి వరకు మందుబాబుల హల్‌చల్ కనిపించింది. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని జడ్చర్ల– రాయచూర్ జాతీయ రహదారికి అటు, ఇటు వైపు.. హౌసింగ్‌బోర్డు మొదలుకుని బండమీదిపల్లి వరకు అలాగే కోస్గిరోడ్, క్లాక్‌టవర్ నుంచి రాజీవ్‌చౌక్ వరకు ఎక్కడ చూసినా వైన్ షాపుల ఎదుట ముఖ్యంగా మెయిన్ రోడ్డుపై మందుబాబులు తమ వాహనాలను పార్కింగ్ చేశారు. దీంతో పాదచారులు ఈ రోడ్డుపై వెళ్లే ఇతర వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆయా చోట్ల పక్కనే మాంసం, చికెన్, చేపలు, చిరుతిళ్లు అమ్మే దుకాణాలు వెలిశాయి. సిట్టింగ్ ఉన్న ప్రాంతాల్లో మందుబాబులు పీకలదాకా తాగి బయటకు వచ్చేటప్పుడు తూలుతూ కనిపించారు.



పద్మావతీకాలనీ చౌరస్తాలోని వైన్ షాపు వద్ద మెయిన్ రోడ్డుపైనే ఆపిన బైక్‌లతో ఇతరులకు తప్పని ఇబ్బందులు

దూరంగా ఏర్పాటు చేయాలి

మా కాలనీతోపాటు పద్మావతికాలనీ, సాయినగర్ వెళ్లే ప్రధార రోడ్డుపై రెండు వైన్స్‌లు ఏర్పాటు చేయడంతో సాయంత్రం అయితే చాలు మందుబాబుల అలజడితో కాలనీ నుంచి బయటకు రాలేకపోతున్నాం. రాత్రిపూట ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉంటుంది. తాగిన మైకంలో ఇళ్ల మధ్యలోకి వచ్చి వీరంగం సృష్టించే సంఘటనలు తరచు జరుగుతూనే ఉంటాయి. కాలనీలకు దూరంగా దుకాణాలు ఏర్పాటు చేయాలి.



– రాజేశ్వరి, హనుమాన్‌నగర్ కాలనీ, కోస్గి

హైవేపై తొలగించాలి

మక్తల్‌లో నేషనల్ హైవే 167 పై ఉన్న వైన్‌లను తొలగించాలి. మద్యం తాగి కొంత మంది ఘర్షణలకు దిగి లేనిపోని తగాదాలు సృష్టిస్తున్నారు. ఆటోలో, ద్విచక్రవాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని అరికట్టేందుకు నివారణ చర్యలు చేపట్టాలి.

– గోవిందరాజు, దాసరిదొడ్డి, మక్తల్



నాగర్‌కర్నూల్ హౌసింగ్‌బోర్డు బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణం

నివాసాల మధ్యలో..

నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని ఇళ్ల నివాసాల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్రీపురం రోడ్డుతోపాటు హౌజింగ్‌బోర్డులో బస్‌స్టాప్ వద్ద ఇళ్ల మధ్యలో దుకాణాలు ఏర్పాటు చేయడంతోపాటు దుకాణాల్లోనే సిట్టింగ్‌లు ఏర్పాటు చేయడంతో సాయంత్రం వేళల్లో మద్యం తాగిన వారు రోడ్లపై వస్తుండటంతో మహిళలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయాందోళన చెందుతున్నారు.



అచ్చంపేటలో మద్యం దుకాణం ఎదుట ఆపిన వాహనాలు

రోడ్లపైనే ఆగడాలు

అచ్చంపేటలో రోడ్డమీదే తాగడం.. వచ్చిపోయే వారితో గొడవలకు దిగడం అచ్చంపేటలో షరా'మామూలైంది'. వారిపై ఫిర్యాదులిస్తున్నా అబ్కారీ, పోలీసు శాఖలు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. 2016లో పర్మిట్ రూమ్‌ల విధానానికి ప్రభుత్వం అనుమతినివ్వడంతో ప్రధాన రహదారికి సమీపంలో ఉండటంతో తరుచూ సమస్యలొస్తున్నాయి. మహిళలపై మందుబాబుల ఆగడాలతో ఇబ్బందులు తప్పడం లేదు. మద్యం దుకాణాలు వ్యాపార సముదాయాలు, ఆర్టీసీ బస్టాండు, జనారణ్యంలో ఉండే ప్రదేశంలో ఉండటంతో అటుగా వెళ్తున్న మహిళలపై ఆగడాలు ఆగడం లేదు.



ప్రమాదాలకు అడ్డాగా..

శాంతినగర్ మున్సిపాలిటీ పరిధిలోని మద్యం దుకాణాల ప్రాంతాలు ప్రమాదాలకు అడ్డాగా మారాయి. ఫుల్లుగా మద్యం తాగిన వారు రోడ్డుపై అటు ఇటు తిరుగుతూ ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఇటీవల సమీపంలోని గుడిసెలో ఉంటున్న ఓ వృద్ధురాలిపై గుర్తుతెలియని వ్యక్తులు అఘాయిత్యానికి పాల్పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయని ఇరుగుపొరుగు వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్ల పక్కనే యథేచ్ఛగా..



అయిజలో రోడ్డు పక్కన మద్యం తాగుతున్న మందుబాబులు

అయిజ మున్సిపాలిటీలో మందుబాబులు వైన్స్ షాపుల ముందు, రోడ్డు పక్కన యథేచ్ఛగా మద్యం తాగుతున్నారు. ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ నిర్వహణ ఎక్కువగా చేస్తుండడంతో కొంతవరకు మందుబాబులు నిబంధనలు పాటిస్తున్నారు. ఏదేమైనా బార్ అండ్ రెస్టారెంట్‌లలో, పర్మిట్ రూంలలో మాత్రమే మద్యం తాగేలా చర్యలు తీసకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

రోడ్ల పక్కన మందుబాబులు మద్యం తాగకుండా చర్యలు తీసుకోవాలి. కొంతమంది మద్యం తాగి రోడ్లపై వాహనాలకు అడ్డంగా వస్తుంటారు. అలాగే కొంతమంది మద్యం తాగి వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.

కొల్లాపూర్ మున్సిపాలిటీలోని బాలికల ఉన్నత పాఠశాల వెనక భాగంలో కల్లు దుకాణం వద్ద రోడ్డుపక్కనే కూర్చుని కల్లు తాగుతారు. ఇటువైపుగా వెళ్లేందుకు

పాఠశాలలో సమీపంలో కల్లు..



పాఠశాల వెనక కల్లు తాగుతూ..

రాత్రి సమయాల్లో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని వైన్ షాపులు ప్రధాన రహదారి వెంటనే ఉన్నాయి. పర్మిట్ రూమ్‌లు కూడా పక్కనే ఉండడంతో ఆయా ప్రాంతాల్లో తాగుబోతులతో రోడ్లపై వెళ్లే వారు ఇబ్బందులకు గురవుతున్నారు.

కోస్గిలోని ప్రధాన రహదారుల వెంట ఏర్పాటు చేసిన వైన్స్‌ల ఎదుట సాయంత్రం మందుబాబుల హడావుడితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బయటికి రాలేని పరిస్థితి



కోస్గిలో వైన్స్ ఎదుట రోడ్డుపై బైక్‌లు ఇలా..

జిల్లాకేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై రెండు వైన్స్‌లు ఏర్పాటు చేయడంతో వాహనాలు రోడ్డుపై ఇష్టారీతిగా ఆపడం వల్ల ట్రాఫిక్ నిలిచిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ దారి గుండా వెళ్లే కాలనీల ప్రజలు సాయంత్రం అయితే బయటకు రావడానికి భయపడుతున్నారు.

నారాయణపేట జిల్లాలోని మక్తల్ నియోజకవర్గంలో హైవే రోడ్డుపై వైన్సులు, దాబాలు ఉండటంతో మద్యంప్రియులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ప్రజలకు ఇబ్బందులు గురి చేస్తున్నారు. నారాయణపేట చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, కన్యకాపరమేశ్వరి ఆలయం దగ్గర మద్యంప్రియులు మత్తులో ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారు.

హైవేలపై ప్రమాదాలు



మద్యం తాగి ప్రమాదకరంగా ఆటోలో వెళ్తూ..



గద్వాలలోని కూరగాయాల మార్కెట్ వద్ద ఇలా..

ప్రధాన కూడళ్లలో ఆగడాలు

జిల్లాకేంద్రమైన గద్వాల పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మద్యం షాపులు ఉండటంతో నిత్యం ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా వైఎస్సార్ చౌరస్తా, కృష్ణవేణి చౌరస్తా, కూరగాయల మార్కెట్ ప్రాంతాలు నిత్యం ప్రజలతో రద్దీగా ఉంటాయి. ప్రధానంగా ఈ ప్రాంతాల్లోని మద్యం దుకాణాల్లో మద్యం తాగిన మందుబాబులు తమ ఆకతాయి చేష్టలతో ప్రజలకు ఇబ్బందులు సృష్టిస్తున్నారు. పూటుగా తాగి ప్రధాన రోడ్లపైనే పడిపోవడం, అకారణంగానే ప్రజలతో ఘర్షణలకు దిగడం వంటివి నిత్యకృత్యమయ్యాయి. ప్రధానంగా కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న వైన్ షాపు ప్రాంతంలో మందుబాబుల చేష్టలకు మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిపై పలుమార్లు వివిధ పత్రికల్లో వెలుగులోకి వచ్చినప్పటికీ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి.

కులవృత్తులను ప్రొత్సహించేందుకే రూ.లక్ష సాయం



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వనజ, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: కులవృత్తులను ప్రొత్సహించేందుకు లబ్ధిదారులకు రూ.లక్ష సాయం అందజేస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కులవృత్తుల అభ్యున్నతికి ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను జెడ్పీ చైర్ పర్సన్ వనజ, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,500 దరఖాస్తులు రాగా వాటిలో ఐదు మండలాలకు సంబంధించి 300మందికి చెక్కులు వచ్చాయని వాటిని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెల నిరంతర ప్రక్రియగా జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ మాట్లాడుతూ నిరుపేద బీసీలను, కులవృత్తులను సీఎం కేసీఆర్ ఎంతో ప్రోత్సహిస్తుండడంతో ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీసీ కులవృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. గతంలో కొందరు దరఖాస్తు చేసుకోగా రూ.50వేల తీసుకున్నందున వారిని రిజెక్ట్ చేశారన్నారు. చెక్కు తీసుకున్న వాళ్లకు అధికారులు తనిఖీలు చేసి కులవృత్తులను ప్రొత్సహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, ఎంపీపీలు శ్రీనివాస్‌రెడ్డి, నర్సప్ప, జెడ్పీటీసీ సభ్యులు అంజలి, లావణ్య , బీసీ వేల్ఫేర్ అధికారి క్రిష్ణమచారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

సీపీఎస్ రద్దు చేసే వరకు ఉద్యమం

నారాయణపేట రూరల్: పాత పెన్షన్ సాధనే ధ్యేయంగా సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యమంలో ముందుకు కదులుతారని టీఎస్‌సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నారాయణపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఓపీఎస్ సాధనే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో చేపట్టిన సంకల్ప రథ యాత్ర విజయవంతమైందని, ఇక రాష్ట్ర స్థాయిలో బహిరంగసభను విజయవంతం చేయడానికి అంతా సిద్ధమవుతున్నట్లు చెప్పారు. పాతపెన్షన్ విధానం అమలుకు రాజస్థాన్‌తోపాటు 6 రాష్ట్రాలు ముందుకు వచ్చాయని, తెలంగాణలో 3.35లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత సీఎం కేసీఆర్‌పై ఉందన్నారు. 19 ఏళ్లుగా ఎన్నో సీపీఎస్ కుటుంబాలు మానసిక అస్థిరతకు లోనవుతున్నాయన్నారు. 12న శనివారం హైద్రాబాద్ నాంపల్లి గ్రౌండ్స్‌లో జరిగే సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నారాయణపేట: ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీవేద సరస్వతి జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించగా.. జడ్జి ముఖ్యఅతిథిగా హాజరై విద్యా సంస్థలలో ర్యాగింగ్ ముప్పు, నివారణ వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. మానసికంగా శారీరకంగా మాటలతో హింసించడం, విద్యార్థులను పీడించడం, కలవర పెట్టడం, అవమాన పరచడం వంటిని నేరంగా పరిగణిస్తారన్నారు. దాడి చేయడం , నేర పూరితమైన శక్తిని ప్రదర్శించి తోటి విద్యార్థులను భయపెట్టడాన్ని ర్యాగింగ్‌గా భావించవచ్చన్నారు. రాజ్యాంగ హక్కులు, క్రిమినల్, సివిల్, పోక్సో కేసులు, పిల్లలపై అఘాయిత్యాలు కేసులు, మహిళలందరికి కోర్టులో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలో ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. డబ్బులు లేని వాళ్లకు ఈ సంస్థ ద్వారా అడ్వకేటును ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రతి కళాశాలలో ఒక కమిటీ ఉండాలని అన్నారు. అదేవిధంగా పిపి కె.సురేశ్ మాట్లాడుతూ చట్టం అందరికి సమానమని, ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ర్యాగింగ్ లాంటి వాటికి పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రఘువీర్ యాదవ్, నందు నామాజీ, దత్తాత్రేయ , ప్రిన్సిపాల్ శేషమ్మ , విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్

ఇష్టానుసారంగా కూల్చివేతలు సరికాదు

కోస్గి: భూత్పూర్–చించోలి జాతీయ రహదారి పనుల్లో భాగంగా పట్టణంలోని ప్రధాన రహదారి నిర్మాణ పనులకు సంబంధించి వ్యాపారులకు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పోలీస్ బలగాలతో ఉదయం 6 గంటలకే వచ్చి కూల్చివేత పనులు చేపట్టడం సరికాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. 2వ తేదీతో నోటీసులు తయారు చేసి 9వ తేది రాత్రి సమయంలో వ్యాపారులకు అందించి 10వ తేదిన తెల్లవారు జామునే జేసీబీలు, పోలీస్ బందోబస్తుతో వచ్చి కూల్చివేతలు చేపట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. వ్యాపారులకు కనీసం 15 రోజుల సమయమైన ఇచ్చి ఉంటే వారే స్వచ్ఛందంగా దుకాణాలను అవసరమైన మేర కూల్చి వేసుకునేవారని, వ్యాపారులకు నష్టం కలిగించేలా ప్రభుత్వం వ్యవహరించడం శోచనీయమన్నారు. మున్సిపల్ పరిధిలో చేపట్టిన రామాలయం నుంచి సయ్యద్ పహాడ్ వరకు రోడ్డు పనులు ప్రారంభించి 6 నెలలు అవుతున్నా నేటికి పూర్తి కాలేదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం సైతం సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉందన్నారు. రోడ్డు వెడల్పులో వంద శాతం ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే ప్రకటించి నేటికి ఎలాంటి న్యాయం చేయలేదన్నారు. అభివృద్ధి పనుల పేరుతో హడావిడి చేయడం తప్ప చేసిందేమి లేదన్నారు. ఇప్పటికైన ఇల్లు కోల్పోయిన పేదలకు న్యాయం చేయాలని, లేదంటే పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామన్నారు. ఇందులో విజయ్ కుమార్, రఘువర్ధన్ రెడ్డి, విక్రంరెడ్డి, రాములు, రాఘవరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, నరేందర్, జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా

వ్యక్తి బలవన్మరణం

గద్వాల క్రైం: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి పట్టణ శివారులోని వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువుల కథనం మేరకు.. పట్టణంలోని బీసీకాలనీకి చెందిన పాండు (38) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. తాగేందుకు డబ్బులు ఇవ్వాలంటూ రోజూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం డబ్బులు ఇవ్వాలంటూ ఇంట్లో వారిని నిలదీశాడు. లేవని చెప్పడంతో మనస్థాపానికి గురై పట్టణ శివారులోని రింగ్ రోడ్డు వద్ద వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకుని మృతిచెందాడు. గుర్తించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రెండో పట్టణ ఎస్‌ఐ అబ్దుల్ షుకూర్ తెలిపారు.

శ్రీపురంలో యువకుడు..

నాగర్‌కర్నూల్ క్రైం: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని శ్రీపురం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన చిన్న (35) భార్యతో గొడవ పడటంతో ఆమె తన అన్న ఇంటికి వెళ్లిపోయింది. మనస్థాపానికి గురైన చిన్న క్షణికావేశంలో ఇంట్లో ఉరేసుకున్నాడు. భార్య మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చి చూడగా మృతిచెంది కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చింది. ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

నవాబుపేట: దాయాదులు తిట్టడంతో మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలపరిధిలోని లోకిరేవులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మరికంటి లక్ష్మమ్మ(40)కు గురువారం ఇంటిస్థలం దాయాదులతో గొడవ జరిగింది. ఘటనలో వారు ఆమెను తిట్టడంతో మనస్తాపానికి గురైంది. తిట్లు తినటం కంటే చావటం మేలని రోదిస్తూ గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఇరుగుపొరుగు ఇచ్చిన సమాచారంతో ఆమెను వెతకడానికి వెళ్లిన భర్త వెంకటయ్య బావిలో దూకి చూడగా ఆచూకీ లభించలేదు. దీంతో గ్రామస్తులు మోటార్లసాయంతో నీటిని తొలగించి మృతదేహాన్ని బయటికి తీశారు. వెంకటయ్య ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని పెద్దాపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఆకుల వెంకటయ్య (45) బంధువు మూడురోజుల క్రితం మృతిచెందాడు. గ్రామంలో నిర్వహించిన మూడురోజుల కార్యక్రమంలో పాల్గొని స్నానం చేసేందుకు చెరువులోకి దిగి ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడి మునిగిపోయాడు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే ఫైర్‌సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయగా అప్పటికే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. భార్య నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెబ్బేరు రూరల్: పట్టణంలోని కొత్తకోట బైపాస్ రహదారిపై గురువారం తెల్లవారుజామున రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపారు. 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా నుంచి మినీ డీసీఎంలో వాహన యజమాని ఓబులేష్, డ్రైవర్ సుధాకర్ కలిసి షాద్‌నగర్‌కు తరలిస్తుండగా పక్కా సమాచారంతో తనిఖీలు చేపట్టి పట్టుకున్నట్లు వివరించారు. పౌరసరఫరాలశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో డీటీ వేణు, నందకిశోర్ పరిశీలించి రేషన్ బియ్యంగా నిర్ధారించడంతో ఇరువురిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రారంభానికి సిద్ధం..


ఎంవీఎస్ కళాశాల మైదానంలో నిర్మించిన మినీ ఇండోర్ స్టేడియం

ఎంవీఎస్ కళాశాలలో రూ.2.65 కోట్లతో మినీ ఇండోర్ స్టేడియం

- నేడు ప్రారంభించనున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- క్రీడాకారులకు అందుబాటులోకి మరో స్టేడియం

మహబూబ్‌నగర్ క్రీడలు: పాలమూరు జిల్లా కేంద్రం క్రీడలకు హబ్‌గా మారుతోంది. జిల్లా కేంద్రంలో క్రీడాభివృద్ధి కోసం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక దృష్టి సారించారు. మంత్రి కృషితో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం క్రీడాస్టేడియాల నిర్మాణం పనులు ఊపందుకున్నాయి. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పనులు ముమ్మరంగా కొనసాగుతూ చివరిదశకు చేరాయి. అదేవిధంగా మెయిన్ స్టేడియంలో స్టేడియం ఆధునీకరణ పనులను పూర్తి చేసి వివిధ కోర్టులు ఏర్పాటు చేశారు. ఇప్పుడు క్రీడాకారులకు జిల్లా కేంద్రంలో మరో మినీస్టేడియం అందుబాటులోకి రానుంది.


మినీ స్టేడియం భవనంపై క్రీడాకారుల బొమ్మలు

రూ.2.65 కోట్ల మినీ ఇండోర్ స్టేడియం

ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో రూ.2.65 కోట్ల నిధులతో మినీ ఇండోర్ స్టేడియం పనులు చేపట్టారు. ఇండోర్ హాల్‌తోపాటు మల్టీపర్పస్ స్పోర్ట్స్ హాల్, కోచ్‌ల గది, కార్యాలయం గదులు నిర్మించారు. మినీ స్టేడియంలో ఇండోర్ క్రీడలకు సంబంధించి షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు చేశారు. అదేవిధంగా త్వరలో 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ కోర్టులతో పాటు 40 మీటర్ల స్కేటింగ్ రింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలోనే మొదటి స్కేటింగ్ రింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఎంవీఎస్ కళాశాలలో నిర్మిస్తున్న మినీఇండోర్ స్టేడియం నిర్మాణం పనులను జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్నారు.

స్టేడియం ఏర్పాటుతో సౌకర్యాలు అందుబాటులోకి...



మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక చొరవతో జిల్లా కేంద్రంలో క్రీడా స్టేడియంలు నిర్మాణమవుతున్నాయి. ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో నిర్మిస్తున్న మినీ స్టేడియంలో క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. క్రీడాకారులకు రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. జిల్లా క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి వెళ్లేలా తీర్చిదిద్దవచ్చు. మినీ ఇండోర్ స్టేడియంను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

నేడు మంత్రితో ప్రారంభోత్సవం..

ఎంవీఎస్ కళాశాల మినీ స్టేడియాన్ని శుక్రవారం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించనున్నారు. మినీ స్టేడియంలో రెగ్యులర్‌గా క్రీడాకారులకు ప్రాక్టీస్ చేయడానికి అవకాశం ఏర్పడింది. జిల్లా కేంద్రంలో మరో మినీ స్టేడియం అందుబాటులోకి రావడంతో క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బస్‌షెల్టర్ల నిర్మాణానికి స్థలాల ఎంపిక..



వీరప్పయ్య దేవస్థానం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు

దేవరకద్ర: పట్టణంలో ఆర్వోబీ నిర్మాణంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ సోమవారం 'సాక్షి' దినపత్రికలో 'ఆర్వోబీతో అష్టకష్టాలు' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. గురువారం ఆర్వోబీకి ఇరువైపులా బస్సులు నిలపడానికి బస్‌షెల్టర్ల ఏర్పాటుకు స్థలాలను పరిశీలించారు. మహబూబ్‌నగర్ వైపు ప్రదీప్‌గౌడ్ వెంచర్ వద్ద స్థలాన్ని పరిశీలించారు. పాత బస్టాండ్‌లో దిగే ప్రయాణికులకు ఈ ప్రాంతం అనువుగా ఉన్నట్లు గుర్తించారు. అలాగే కొత్త బస్టాండ్ వైపు రాయచూర్ రోడ్‌లో వీరప్పయ్య దేవస్థానం స్థలాన్ని ఎంపిక చేశారు. రెండుచోట్ల బస్‌షెల్టర్ల నిర్మాణానికి ఏఈ కురుమూర్తి కొలతలు తీసుకొని అంచనాలు రూపొందించారు. స్థల పరిశీలనలో ఎంపీపీ రమాదేవి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓ సీత్యానాయక్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, నాయకులు బాలరాజు, యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాలమూరులో ఈషా గ్రామోత్సవం

- నేటి నుంచి రెండురోజుల పాటు వాలీబాల్, త్రోబాల్ పోటీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు 15వ ఈషా గ్రామోత్సవం నిర్వహించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడల ప్రోత్సాహం కోసం తొలిసారిగా తెలంగాణలో ఈషా గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఈషా ఫౌండేషన్ వలంటీర్లు కొన్ని రోజుల నుంచి ఏర్పాట్లు చేస్తున్నారు. పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నారు.

నగదు బహుమతులు, సర్టిఫికెట్లు...

జిల్లాస్థాయిలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేయనున్నారు. అదేవిధంగా జిల్లాస్థాయిలో విన్నర్, రన్నర్ జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయి. అక్కడ గెలుపొందే జట్లు కోయంబత్తూర్‌లో జరిగే సౌతిండియా పోటీల్లో పాల్గొంటాయి. మహబూబ్‌నగర్ జిల్లాస్థాయిలో వాలీబాల్‌కు 35 జట్లు, త్రోబాల్‌కు 15 జట్లు పాల్గొంటున్నాయి. ఈషా గ్రామోత్సవం జిల్లాస్థాయి క్రీడాపోటీల ప్రారంభోత్సవంలో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్, సినీగాయకుడు రామ్ మిర్యాల, నటుడు కిరణ్ అబ్బవరం ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.


ఈషా గ్రామోత్సవం కోసం మెయిన్ స్టేడియంలో ఏర్పాట్లు

ఈఓ కార్యాలయాన్ని ముట్టడించిన భక్తులు

- అన్యామత కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపణ

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ రంగనాథ్ అవినీతికి పాల్పడుతూ.. మతేతర కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నారంటూ స్థానిక ప్రజలు, భక్తులు గురువారం ఆలయ ఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు. సీనియర్ అసిస్టెంట్ రంగనాథ్ భక్తుల దగ్గర విరాళాలు సేకరించి రసీదులు ఇవ్వకపోగా హైందవేతర వ్యక్తులతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. విధులు నిర్వర్తించే సమయంలో మతేతర వ్యక్తిని చైర్మన్ చాంబర్‌లో కూర్చోబెట్టుకొని రహస్య చర్చలు జరుపుతున్నారని.. అంతేగాకుండా ఆ వ్యక్తికి తన అకౌంట్ నుంచి రూ.లక్షలు బదిలీ చేస్తున్నారని, అందుకు తగిన ఆధారాలను బయట పెట్టారు. ఇంతేగాకుండా భక్తుడి కుమార్తెకు ఫోన్‌చేసి ఇతర మతానికి చెందిన అబ్బాయిని పెళ్లి చేసుకోమని బలవంతం చేస్తున్నారని.. ఆలయంలో చేసే పనులు ఇవేనా అంటూ ఈఓను నిలదీశారు. కర్నూలులోని ఆలయ భూములను పదేళ్లుగా గుట్టుగా లీజుకు ఇచ్చుకొని ఆదాయానికి గండి కొడుతున్నారని మండిపడ్డారు. ఇంతేగాకుండా శ్మశాన నారాయణుడు, పితృదోశాలంటూ లేనిపోని కల్పితాలు చెబుతూ భక్తుల దగ్గర సొమ్ము కాజేస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. ఇంత జరుగుతున్నా సిబ్బందిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. సీనియర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోకపోతే ఆలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఈఓ పురేందర్‌కుమార్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నారాయణ రెడ్డి, పురపాలక వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకట్రామయ్యశెట్టి, గంగిరెడ్డి, మాజీ సర్పంచ్ జయరాముడుతో పాటు 20 మంది పాల్గొన్నారు.


ఈఓ పురేందర్‌కుమార్‌తో మాట్లాడుతున్న భక్తులు

బాలికపై ముగ్గురి అత్యాచారం

- గర్భం దాల్చడంతో వెలుగులోకి..

ఊర్కొండ: మండలంలోని ఓ గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలికకు మాయ మాటలు చెప్పి ముగ్గురు అత్యాచారానికి పాల్పడ్డారు. అయితే ప్రస్తుతం బాలిక గర్భం దాల్చడంతో ఈ సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ లెనిన్ కథనం ప్రకారం.. బాలిక అదే గ్రామంలోని పాఠశాలలో గతేడాది 8వ తరగతి చదివేది. ఈ ఏడాది తల్లి సదరు బాలికను కల్వకుర్తిలోని కేజీబీవీలో చేర్పించింది. అయితే మూడురోజుల క్రితం బాలిక అనారోగ్యానికి గురవడంతో పాఠశాల నిర్వాహకులు తల్లికి సమాచారం ఇవ్వడంతో ఇంటికి తీసుకువచ్చి ఆస్పత్రిలో చూపించగా.. గర్భం దాల్చిందని వైద్యులు నిర్ధారించారు. దీంతో తల్లి బాలికను నిలదీయగా కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన ముగ్గురు బాలురు అత్యాచారానికి పాల్పడుతున్నారని చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దొంగనోట్ల కలకలం?

కల్వకుర్తి రూరల్: పట్టణంలో రూ.500, రూ.200 దొంగనోట్లు చలామణి అవుతున్నట్లు పలువురు వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. ఇటీవల ఓ ఏజెన్సీ నిర్వాహకుడు దుకాణాల్లో డబ్బులు వసూలు చేసుకొని ఇంటికెళ్లి లెక్కించుకోగా అందులో దొంగనోట్లు ఉన్నట్లు తేలడంతో అవాక్కయ్యారు. తిరిగి ఆయా దుకాణాలకు వెళ్లి మార్చుకున్నట్లు తెలిసింది. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు అయిష్టత వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా మరో దుకాణంలో రూ.500, రూ.200 దొంగనోట్లు బయటపడగా అవి ఎవరిచ్చారో తెలియక చింపేసినట్లు సమాచారం. క్షుణ్ణంగా పరిశీలిస్తే తప్పా అసలు నోట్లో, దొంగనోట్లో తేడా కనిపించడం లేదని ఆ వ్యాపారి వాపోయారు. రూ.10 లక్షలు అసలు నోట్లు ఇస్తే.. రూ.30 లక్షల దొంగనోట్లు వారికి ఇస్తున్నట్లు తెలిసింది. ఎలాంటి కష్టం లేకుండానే రూ.లక్షలు సంపాదించవచ్చనే దురాలోచనతో ఈ వ్యాపారానికి తెర తీసినట్లు సమాచారం. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి ఈ వ్యవహారానికి అడ్డుకట్ట వేయాలన్న డిమాండ్ వినిపిస్తుంది.

సఫాయిల సమస్యల పరిష్కారానికే చట్టం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సఫాయి కర్మచారీల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం 1993లో ప్రత్యేకంగా ఓ చట్టాన్ని తీసుకొచ్చిందని సఫాయి కర్మచారీల జాతీయ కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేశన్‌జీ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ రవినాయక్, ఎస్పీ నరసింహ, సంబంధిత శాఖల అధికారులు, సఫాయి కర్మచారీలు, సఫాయి కర్మచారీల సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సఫాయి కర్మచారీల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. యంత్రాలతో కాకుండా చేతులతో పారిశుద్ధ్య పనులు చేసే వారికి ఎక్కువ కష్టాలు ఉంటాయని.. వీరి కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. కాంట్రాక్టు కార్మికుల కష్టాలు తెలుసుకొని పరిష్కరించేందుకు దేశవ్యాప్తంగా జిల్లాల్లో పర్యటిస్తున్నట్లు వెల్లడించారు. సఫాయి కర్మచారీలను వేధిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని.. కాంట్రాక్టర్లు వేధిస్తే బ్లాక్‌లిస్టులో ఉంచుతామని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం నెలసరి వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్‌ఐ, గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆదేశించారు. వీటిపై అవగాహన కల్పించేందుకు జిల్లావ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. సఫాయి కార్మికులతో ప్రత్యేకంగా మాట్లాడి ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కలెక్టర్ జి.రవినాయక్ మాట్లాడుతూ.. చేతులతో పారిశుద్ధ్య పనులు చేసేవారు ఇంకా ఎవరైనా ఉన్నట్లయితే అలాంటి వారిని గుర్తించి కావాల్సిన సౌకర్యాలు కల్పించేందుకు, వారి సంక్షేమం కోసం జాతీయ సఫాయి కర్మచారిల చైర్మన్ జిల్లాకు వచ్చినట్లు వివరించారు. అదనపు కలెక్టర్ యాదయ్య, అడిషనల్ ఎస్పీ రాములు, సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ డిప్యూటీ డైరెక్టర్ పాండు, మున్సిపల్ కమిషనర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎం.వెంకటేశన్‌జీ

జూరాల క్రస్టు గేట్ల మూసివేత

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు తగ్గుముఖం పట్టాయి. గురువారం ఉదయం రెండు గేట్లు తెరిచి నీటిని విడుదల చేసిన అధికారులు సాయంత్రానికి ఇన్‌ఫ్లో 15వేల క్యూసెక్కులకు తగ్గడంతో గేట్లు మూసివేశారు. అలాగే మధ్యాహ్నం ఒంటిగంటకు విద్యుదుత్పత్తిని నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం వరకు ఎగువలో రెండు యూనిట్లు ద్వారా 78 మెగావాట్లు, దిగువలో రెండు యూనిట్ల ద్వారా 80 మెగావాట్ల విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు ఎస్‌ఈ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆవిరి రూపంలో 113 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఒక పంపుల ద్వారా 750 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, జూరాల ఎడమ కాల్వ ద్వారా 870 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 500 క్యూసెక్కులు, భీమా లిఫ్టు –2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 3,198 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7.875 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా... ఎగువన ఉన్న ఆలమట్టి ప్రాజెక్టుకు ప్రస్తుతం 19,888 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 15 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 15వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. అదేస్థాయిలో విడుదల చేస్తున్నారు.

ఒక పంపులో సాంకేతిక సమస్య...

నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన లిఫ్టు–1 గుడ్డెందొడ్డి వద్ద ఒక పంపులో బుధవారం అర్ధ రాత్రి సాంకేతిక సమస్య రావడంతో ఒక పంపు నీటి పంపింగ్ నిలిచిపోయింది. కొన్ని రోజులుగా రెండు పంపుల ద్వారా వరద నీటిని ఎత్తిపోసి గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు రిజర్వాయర్లను నింపుతున్న విషయం తెలిసిందే. కొనసాగుతున్న రెండు పంపుల్లో ఒక పంపులో ఫిల్టర్ పైప్‌కు రంధ్రం ఏర్పడి సాంకేతిక సమస్య ఏర్పడింది. దీంతో గురువారం ఒక పంపు ద్వారా నీటిని ఎత్తిపోశారు. సాంకేతిక నిపుణులచే మరమ్మతులు చేయిస్తున్నామని, గురువారం అర్ధరాత్రి లేదా శుక్రవారం ఉదయానికి అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

శ్రీశైలంలో 865.2 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో గురువారం 865.2 అడుగుల నీటిమట్టం, 123.0196 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాయంత్రం ఆరు గంటల సమయంలో భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో రేగుమాన్ గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 5.746 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 11,355 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేశారు. జలాశయంలో 319 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటి మట్టం

మదనాపురం: రామన్‌పాడు జలశయానికి గురువారం 870 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 870 క్యూసెక్కులు ఉండగా.. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 900 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రజీల్‌రెడ్డి తెలిపారు.